


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

7

(సెప్టెంబర్ ౦౯, ౧౯౭౧, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**పరిపూర్ణత, ప్రతిభ - కళల విషయంలో సాధించవలసిన విజయాలు.** అవి వ్యక్తికేకాదు, కళాలోకానికే విజయాలు... అందువల్ల వాటిని జాగ్రత్తగా కాపాడటం నేర్చినవారు నిజమైన కళాపోషకుల క్రింద జమకట్టబడతారు..

దేశంలో కోట్లాదిమంది ప్రజలుండగా - కొద్దిమందే కళాకారులుగా భాసించడమేమిటి? కొద్దిమందే గాయకులుగా నిలబడగలగడం దేనివల్ల?.. పరిపూర్ణతా, ప్రతిభా - ఆ కొద్దిమందికే లభ్యమైంది గనుక - భగవంతుడు వారినిలా దీవించి పంపాడు గనుక.

***ఒక్క ఘంటసాల, ఒక్క బాలమురళీ***

అందుకని గాయకుల్ని ఏ దేశం ఒక్కసారిగా చూడలేదు. మన సినిమా ప్రపంచంలో చెప్పుకోతగ్గ గాయకులు వేలాది పాటలు పాడినా విసుగు పుట్టని గాయకుడు - ఒక్క ఘంటసాలే ఉండట మేమిటి మరి!.. ఆంధ్రదేశంలో ఒక్క బాలమురళియే ఉండటమేమిటి? ఆ పేరుగలవాళ్ళంతా పాటకచ్చేరీలు చేయవచ్చుగా!

స్త్రీలలో ఒక్క భానుమతి, ఒక్క సుశీల, ఒక్క గోపాలరత్నం లభించడమేమిటి! ప్రతి వారికీ "రాల్ కరిగించు విమల గాంధర్వం" లభించదేం..! సాంప్రదాయ గాయకులలో లలిత సంగీతంలో ఆరితేరిన వాళ్ళు ఏకొద్దిమందో ఉన్నారు. అందరినీ కలిపి ఆలోచించినా కోటికో నలుగురు అయిదుగురు గానసుధను అందించగలవారుంటారు. వారినే మనం పూజిస్తున్నాం.. గౌరవిస్తున్నాం.. సంగీతం కోసం వారి మీద ఆధారపడే ఉంటున్నాం.

***ఒక్క లత, ఒక్క ముఖేష్, ఒక్క రఫీ, ఒక్క తలత్***

హిందీ ఫిలింరంగంలో ఎందరో గాయకులు, గాయనీమణులు ఉన్నారు. కాని ఒక్క లత, ఒక రఫీ, ఒక్క ముఖేష్, ఒక్క తలత్ - మనల్ని ముగ్ధుల్ని చేయగలుగుతున్నారు.. వారి సంగీతం కోసం మనం ఎంతో ఆశతో ఎదురు చూస్తూ ఉంటాం..

దేశంలో సాంస్కృతిక సంపదలు సజీవంగా ఉండాలంటే కళలన్నీ పరిపూర్ణమైన స్థితిలో పోషించబడాలి. తక్కినవారి గానాలు లెక్కలోకి రావు.. 'నీ సంగీతానికి నా సహనమే సరిపోయింది. తల అంతగా తిప్పినందుకు నీ తంబురా ఇలా పెట్టి పోవయ్యా గాయకోత్తమా' అన్నట్లు ఉండవచ్చు.

"మీ వారు పడుకోబోయే వేళ ప్రతిరాత్రీ అలా సంగీతం పాడతారు. మీకేమైనా హాయిగా ఉంటుందా?" అని ఒక ఇల్లాలు ప్రక్కింటి ఇల్లాల్ని అడిగిందట.

"నాకు మాత్రం హాయిగా ఉంటుంది. తక్కినవాళ్ళు సంగతి నాకెందుకు? ఆయనగారు ఒకవేళ బద్దకించినా నేను అరుగుమీద కూర్చుని కాస్సేపు రాగాలాపన చెయ్యండని బ్రతిమాలుతాను" అన్నదట ఆ ఇల్లాలు.

"అలాగా! మీరు కోరి కూడా పాడిస్తూ ఉంటారా? అందులో రహస్యమేమిటో చెప్పండి.. మేము కూడా తెలుసుకుంటాం. ఆయన పాట ఆపేదాకా మా ఇంట్లో పసిపిల్ల బాలాది ఎలాగూ నిద్రమేల్కొంటున్నాం... కాలం వృధాగా పోతోందనుకుంటున్నాం. ఆ రహస్యం మాక్కూడా చెప్పండి. - ఆ హాయి మేము కూడా అనుభవిస్తాం" అని ప్రక్క ఇంటి ఇల్లాలు అడిగిందట ఎంతో ఆత్రంగా.

*<u>అలవాటయిన కంఠం కప్పలకంటే నయంకాదూ!</u>*

"రహస్యం ఏమీలేదమ్మా.. అందరికీ తెలిసిన విషయమే.. మన ఇళ్ళ వెనకవున్న నీళ్ళగుంటలో కప్పలు బెకబెకలాడుతూ ఉంటాయి ఎప్పుడూ? రాత్రిళ్ళు ఆ శబ్దం మరీ ఎక్కువ. తక్కినప్పుడు భరించినా నిద్రవచ్చేటప్పుడు ఆ మోతను తలబ్రద్దలయినట్లుంటుంది. కునుకు పట్టదు వానాకాలంలో ఈ బెడదా తప్పదు.. అందుకని మా వారిని కొంచెం సేపు పాడమని అడుగుతా.. ఎరుగున్న గొంతు కనుక ఎలాగో అలా భరించకలుగుతున్నా.. కప్పల బెకబెకలు వినిపించవు కనుక కాస్త కన్ను మూసి నిద్రపోతున్నా" అని చెప్పిందట.

మేమెరుగున్న ఒకరి ఇంట్లో రాత్రిపూట ఆ ఇల్లాలు జోలపాట ప్రారంభించేది. ఆ పిల్ల నిద్రపోవడం కోసం ఆవిడ చేసే ప్రయత్నంలో చుట్టుపట్ల నాలుగు ఇళ్ళల్లో వాళ్ళు మేలుకునేవారు. భర్త ఎంతో గిజగిజలాడిపోయే వాడు. "కొంచెం ఆపవే పుణ్యం ఉంటుంది" అని బ్రతిమాలేవాడు..

"అదేమిటండీ! పిల్లకు నిద్రవస్తోంది. మధ్యలో ఆపమంటారేమిటి! చూడండి అయిదు నిముషాల్లో నిద్రపోతుంది" అనేది.

<u>నీ పాటకు నిద్రపోవడంలా.. భయపడి!</u>

"పిల్ల నీ పాటకు నిద్రపోతుందనడం కలలో వార్త. ఆ అరుపులకు అదిరి, బెదిరి, హడలిపోయి భయంతో నిద్రపోతుంది" అనేవాడాయన.

మేము మద్రాసులో ఉండగా ఒక ఆంధ్ర మహిళ అక్కడగల సంగీత వాతావరణం చూసి తనుకూడా సంగీతం నేర్చుకోవాలని ఎంతో ముచ్చటపడింది. "నేను ఇంట్లో లేనప్పుడు నేర్చుకో పాటాలు - అలా అయితే నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు ఆమె భర్త. ఆవిడక్కడికే సంతోషించింది. ప్రయివేటు మాష్టర్ని కుదుర్చుకుంది.

మంచి ప్రౌఢ వయస్సు. నలుగురు పిల్లలు. ఒక్కడు బడికి వెళ్ళేవాడు. తక్కిన ముగ్గురు పిల్లికూనలల్లే ఇంట్లోనే తిరుగుతూ ఉండేవాళ్ళు. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రయివేటు...

గొంతుమంచిది. అభిలాష తక్కువలేదు. అందువల్ల త్వరలోనే కీర్తనల్లోకి వచ్చింది.

కాని ఆవిడ అవస్థ ఇలా ఉండేది.

"రామా సుజన జీవనా. ఆ..ఆ."

కుర్రాడు "అమ్మా కాలికి దెబ్బ తగిలిందే! "

"ఎందుకు ఏడుస్తావు!.. గూట్లో టించర్ ఐడిన్ ఉంది రాసుకో...సుజన జీవనా - సుగుణ భూషణా అజనందిత శ్రిత నందన దశతురంగ.. "

*<u>దశ తురంగమా పరుపు క్రింద బిస్కెట్లున్నాయి!</u>*

పిల్ల: "అమ్మా ఆకలవుతోందే. కడుపులో మండిపోతోంది. "

"మండిపోతే పరుపు క్రింద బిస్కట్ పొట్లం ఉంది. రెండు తిని మంచి నీళ్ళు త్రాగు. మాంచి పుష్టినిస్తాయి రుచిగా ఉంటాయి. ఇక నాకు అడ్డురాకు. చారునేత్రా శ్రీకళత్రా శ్రీ రమ్యగాత్రా.. "

పిల్లాడు: అమ్మోయి! చిట్టి చెల్లాయి లేచిందే.

"లేస్తే అక్కడ పాలసీసా ఉంది త్రాగించు.. అదే ఊరుకుంటుంది.. నన్ను పాడుకోనీ."

ప్రయివేటు మాష్టారు. అమ్మా పాడబోయేది. "శాంతమూ లేక..."

ఇల్లాలు: "అలాగే మాష్టారూ!"

సంగీతంలో ఎన్ని అవాంతరాలో చూడండి. అయినా అభిలాష అలాగే ఉంటుంది. కమ్మటి పాటలో మధ్య మధ్య గందరగోళాలుంటే ఫలితమేం దక్కుతుంది!?

రేడియోలో మొదట్లో పేర్కొన్న మహాగాయకుల గానాన్ని ఆస్వాదిస్తూ మధ్య మధ్య వర్తక ప్రకటనలు వింటుంటే - కళాపోషణకు దోహదం చేసే ప్రభుత్వం ఎంత తెలివైన పనిచేస్తోందో అనిపిస్తుంది...!

●●●

Comment on this article..